కథానిక

# స్వప్నవాసంతం

కె. రామలక్ష్మి

"ఆడదంటే యింత గౌరవంలేని వాడివి నన్నెందుకు పెళ్ళాడావు? నాలాంటిదాని ఉసురు తగిలితే నీకుమటుకు ఎక్కడది సౌఖ్యం?" రాబోయే ఏడుపుతో కంఠం కంపించిపోతూంటే యింకా ఏవేవో అనాలన్న కుతూహలం మాటలని పెగలనీయకుండా చేస్తూంటే గట్టిగా అడిగింది పార్వతి.

"పక్కింటివాళ్ళు వింటారు మెల్లిగా మాట్లాడు పార్వతీ" పేపరులోంచి తలేనా ఎత్తకుండా అన్నాడు కృష్ణమూర్తి.

"వింటేవిననీ తప్పేముంది? అందరికీ నువ్వు మంచివాడివే. అందరికీ నేను గయ్యాళినే... నా కెన్నిసార్లు ప్రామిస్ చేశావు. సెకండ్‌షో సినిమాకి వెళ్ళను. అందులోనూ యింకో ఆడదాన్ని తీసుకుని-అని. అన్నీ మరిచిపోయి రాత్రి రెండుగంటలకి యిల్లు చేరితే యిదేం యిల్లా? ఈలోగా నా పీక ఎవరేనా నొక్కినా దిక్కేది!"

"అదేమిటి పార్వతీ, ఎవరేనావింటే నవ్వుతారు. ఇంకో ఆడదేమిటి? సినిమాఏమిటి? నేను సినిమాకి వెళ్ళలేదు. వసంత వెళ్ళిందని చెప్తే ఇంటికి దేబెట్టిరాడానికే ఆ టైంకి వెళ్ళాను. నిజం చెప్తే నమ్మవెందుకు పార్వతీ. ఇలా అయితే ఎలాగ చెప్పు?" అనునయం ఉట్టిపడే గొంతుకతో అన్నాడు. ఆ స్వరం మరీ కోపం తప్పించింది పార్వతికి.

"నిన్ను నమ్మి యిక్కడిదాకా వచ్చాను. మనిద్దరం యిలా అస్తమానూ దెబ్బలాడుకుంటూ వుంటే, నువ్విలా అర్థరాత్రీ అపరాత్రీ స్నేహితులు రాళ్ళని యిళ్ళకి దేబెట్టడానికి వెళ్ళివస్తూంటే, నానిగాడు ఎలా తయారవుతాడో— ఆలోచనేనా లేదు నీకు. సరికదా నేనేదో గయ్యాళినని విరుచుకు పడతావు. వాడు ఉట్టి వెధవగా తయారయితే, తల్లిపెంపకం అంటారు అందరూ, అంతే కాని, అందులో నీవాటా తొంభైతొమ్మిదిపాళ్ళు అని ఎవరికి తెలుస్తుంది?..అయినా నీథోరణేం నచ్చలేదునాకు." 'పోనీలే పొద్దున్నే చూచుకుందాం. నిద్రపో రెండున్నరా మూడవుతోంది' అంటూ కృష్ణమూర్తి అప్పటిదాకా అడ్డుపెట్టుకున్న పేపరు మడిచి కుర్చీలోంచి లేచాడు. ఏడవకూడదన్న తాపత్రయంతో గంభీరంగా ముఖంపెట్టుకుని పార్వతి నడుం వాల్చిందేకాని, కృష్ణమూర్తి కంఠం కౌగిలించుకొని గట్టిగా ఏడ్వాలనుంది. కాని పౌరుషం! ఆధునిక యుగంలో అన్ని జబ్బులకీ తోడు యీ పౌరుషం జబ్బొకటి: చదువు సంధ్యలు యింకే సదుపాయాలూ కల్పించకపోగా, యీ కుళ్ళికుళ్ళి లోపల ఏడ్చే గుణాన్ని పెంచాయి: హాయిగా ప్రియభర్త కట్టెదుట ముఖాన కొంగు కప్పుకొని ఏడిస్తే హృదయం తేలిక పడుతుంది. మబ్బులు విడిపోయి సాంసారిక జీవితం ప్రశాంతంగా వుంటుంది. అదే చేతకాదు. అందుకే, ప్రతి చిన్న విషయానికీ లోపల బాధపడ్డం, పైకి గంభీరంగా ముఖం పెట్టడం. యీ ద్వంద్వ వ్యక్తిత్వ ప్రదర్శనతోటే అన్నిరకాల నీరసాలూ వస్తున్నాయి. కళ్ళు మూసుకుని పడుకుందేకాని, గట్టిగా ఏడ్చేయాలని వుంది పార్వతికి. కాని పౌరుషం అడ్డు తగిలింది. తనని తప్ప యింకోళ్ళని పెళ్ళి చేసుకోనని సంవత్సరాలు ఎదురుచూసి చివరకి తనని పెళ్ళి చేసుకున్న కృష్ణమూర్తేనా యిలా తనని బాధపెడుతున్నది? తనొక్కర్తే రెండుగంటల దాకా యింట్లో-ఒక్కర్తేవుంటే, బాధ లేదుకాని, ఎవరో అమ్మాయి రెండో ఆట సినిమానుంచి యింటికి వెళ్ళలేదని దేబెట్టడానికి వెడతాడా? అలా అని చెప్తే ఎలా నమ్మడం? తను నమ్మితే చాలు అంటాడు. అలా అని పైకి అన్నా తను నిజంగా నమ్మలేదే! యిలాంటి క్షోభ తన కెందుకు రాశాడు దేవుడు? ఏడాది నానిగాడు యిదంతా

మొదట్లో అర్థంకాక ఏమిటా అనుకుంటాడు. కాని కొన్నాళ్ళకేనా వాడికి అర్థంకాదూ? అప్పుడేమనుకుంటాడు వాడు? ఏమిటీ అమ్మా నాన్న అనుకోడూ? అప్పుడు వాడికి తనమీద అభిమానం గౌరవం వుండమంటే ఎలావుంటుంది? ఆలోచనలు భోగమంచులా అలముకొని పార్వతి కళ్లువర్షిస్తూనే వున్నాయి. తనకేం పట్టనట్టు, ఏ విపరీతం జరిగినా పొద్దున్న చూచుకోవచ్చు నన్నట్లు గోడకేసి తిరిగి పడుకున్నాడు కృష్ణమూర్తి. పార్వతీ అంటూ తనని దగ్గరకి తీసుకున్నా యీ ఆలోచనలు కట్టడి కొంచెం ఉపశాంతి కల్గేది. కాని అతనలా పడుకునే సరికి అసలే అన్ని విధాలా తా నవమానింపబడుతున్నానని బాధపడుతున్న పార్వతి అహం ఇంకా దెబ్బతింది. అంత వసంత క్షేమంపట్ల వెన్నలాకరిగే కృష్ణమూర్తి హృదయం తనపట్ల ఎందు కిలా వుంటుంది? మధ్య నీ వసంత ఎవరు? హాయిగావున్న సంసారాల్లో చిక్కు సమస్యల్లా యిలాంటివాళ్ళు ఎందుకు తయారవుతారు? తనకే పౌరుషం వుంటే యీ వసంత కెలాగేనా బుద్ధిచెప్పాలి. అవును. తనెలాగా గయ్యాళే. ఆ మాట కృష్ణమూర్తే అన్నప్పుడు లోకం అనుకుంటే లెక్కేమిటి? ప్రతీకార వాంఛ ప్రబలం అవుతూంటే దారితెన్నులు వెతుగుతూ పార్వతి మనస్సు సుషుప్తావస్థ చేరింది...

"కట్టుగుడ్డలతో మనిషిని అవతలకి పంపేయడం గౌరవం అనుకున్నావు కాబోలు! యింత చదువూ సంస్కృతీ-దండుగ."

"నువ్వెవరు అలా అనడానికి? నాకు చేసే అన్యాయానికి అన్నివిధాలా చేయూతనిస్తూ, మళ్ళీ నన్నే అనడానికి వచ్చావా? అయినా, వసంతా, ఒక్కసంగతి అడుగుతాను నిజంచెప్తావా?" అడిగింది పార్వతి.

"నీలాంటి ఆడవాళ్ళుంటారంటే నమ్మేదాన్ని కాదు పార్వతీ, యిప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాను. నేనూ నిన్ను నాలుగడిగి పోదామని వచ్చాను. నువ్వూ అడుగు" అంది వసంత.

"కృష్ణమూర్తికి నువ్వంటే ఎందుకంత అభిమానం? అతనికి పెళ్ళి పెడాకులూ అయాయి కదా, నీకేనా తోచద్దూ. నేనే ఏదో దేవతనని, నే లేకుంటే తనకి బతుకేలేదని, తన జీవితాన్ని పంచుకోమని వేధించి పెళ్లి చేసుకున్నాడే, అలాంటి వాడు నన్నిలా నిర్లక్ష్యంచేస్తే ఎలావుంటుందో ఊహించలేవూ?" కళ్ళనీళ్లు ధారాపాతంగా ప్రవహిస్తున్నాయి పార్వతికి. ఈ హడావిడంతా చూసి నవ్వుకుంటోంది వసంత. అవును. వసంతలకి నవ్వే వస్తుంది. స్త్రీకి యిల్లంటూ ఒకటి ఏర్పడి, దానిలో తనకి యివ్వవలసిన స్థానాన్ని భర్త యివ్వకుంటే ఎలా నారీ హృదయంలో హాలాహలం రేగుతుందో వసంతకేం తెలుసు? 'ఎందుకు నవ్వుతావు వసంతా?' అమాయకంగా అడిగింది పార్వతి. 'నవ్వక ఏం చెయ్యను నీ తెలివి తేటలకి? భార్య వుంటే యిక మొగవాడు పరాయిస్త్రీతో మాట్లాడనే కూడదా? స్నేహితులూ, ఎరుగున్న వాళ్లూ నీ రాకతో పోవలసిందేనా. ఏమిటి పార్వతీ, యింత అర్థ లేకుండా మాట్లాడుతావు? నువ్వే యిలా అయిపోయావంటే యిక యీమాత్రం యింగితజ్ఞానం లేనివాళ్ళు ఎలా ప్రవర్తిస్తారో ఊహించుకోలేకుండా వున్నాను... అందుకే పాపం! వీధులోకొస్తే చాలు ఆవదం ముఖాలు పెట్టేసుకుంటారు."

"అలా అంటావుగాని యీ మొగవాళ్ళు యింటి దగ్గిరా అలాంటి ముఖాలే పెడతారేమో అని ఎందుకాలోచించవు? కృష్ణ సంగతే చూడు. వచ్చేసరికి ఎంతో సరదాగా వుంటాడు. కాని యింట్లో ఏముందో మరి, పేపరు అడ్డుతీయడా ముఖానికి. ఒకటే పజిళ్ళు. న్యూసుపఠనం. ఇంట్లో నానిగాడున్నాడు. నేనున్నాను. రేడియోవుంది. చూడ్డానికి కిటికీల్లోంచి కావలసినంత ప్రపంచంవుంది. మరెందుకు వీటన్నిటినీ కాదని అలా పేపర్లో తలదాచేసుకుంటాడు? ఇదివరలో యిలా వుండేవాడా... అన్నీ నీమూలాన్నేనని నా నమ్మకం. నే గయ్యాళిదాన్నన్నాడు. ఎవరేనా అలా అనకుంటే కృష్ణమూర్తి అలా అంటాడా? అది నువ్వే అనివుండాలి.' 'ఛీఛీ, అలాంటి పిచ్చివాగుడు వాక్కు. ఆమాట కొస్తే ఆ మాట అతనే నా దగ్గిరా అన్నాడు.' 'ఆఁ నిజంగానా! నీ ఎదురుగుండా కూడా నన్నలా అంటాడా? అందుకే యిప్పుడతని తరఫున వకాల్తా పుచ్చుకుని వచ్చావు; రాగలిగావు. అవునా?"

"అలా రాలేదు పార్వతీ, కృష్ణమూర్తిని ఇంటికి రావద్దన్నావుటగా? ఎక్కడికి? పోతాడు—అందుకే

ఎక్కడైతే విశ్రాంతి లభిస్తుందో అక్కడికి వచ్చాడు. మనిషిని అంతగా గాయపరిచాక మళ్ళీ అతనిముఖం ఎలాగా చూడవు. అందుకే పూర్తిగా అతనికి విశ్రాంతి చిక్కేలా ఏర్పాట్లు చేద్దామని వచ్చాను. కృష్ణమూర్తికి విడాకులిస్తావా? అదే నయంకదూ యీ నరకంకంటే?"

"నువ్వేం మాట్లాడుతున్నావో నీకేమైనా తెలుస్తోందా వసంతా! విడాకులేమిటి? యివ్వడం ఏమిటి? నానిగాడేమవుతాడు? పాత మమతలేమవుతాయి?"

"మరవన్నీ ముందే ఆలోచించుకోవలసింది. యిప్పుడు టూ లేట్. యిదుగో కృష్ణమూర్తి సంతకంతో కాగితం. అఫెడవిట్ కోర్టులో దాఖలు చేయడానికి...నీకు నా సానుభూతి...పాపం, యిప్పుడేనా ప్రశాంతంగా వుండి, అతన్ని హాయిగా బ్రతకనీ...నే వెళ్ళనా?"

"ఎక్కడికి? వసంతా యింత అన్యాయానికి నువ్వే అతన్ని దించావు. కృష్ణ! ఎంత మంచివాడు. నీలాంటిదాని మాటలు విని నన్ను కాదంటాడా? కోర్టుకి వెడతాడా, నేన్నమ్మను. అది నీ కుచ్ఛితం. నువ్వే అతని సంతకం పెట్టివుంటావు. కృష్ణమూర్తి ఎప్పుడూ యీ పార్వతిపై అత్యాచారానికి పూనుకోడు. యీ పార్వతి ఎంతటి వెర్రిదో, ఎంతగా అతన్ని ప్రేమిస్తుందో అతనికి తెలుసు. అది నీ ఫోర్జరీ. నువ్వే అతని సంతకంపెట్టి నన్ను దడిపిస్తున్నావు. అది ఫోర్జరీ, అది ఫోర్జరీ నాకు తెలుసు."

"పార్వతీ-" చల్లని చెయ్యి తగిలి వులిక్కిపడి లేచింది పార్వతి. ఎదురుగా కృష్ణమూర్తి. ఆదుర్దాగా తన ముఖంలోకి చూస్తున్నాడు. "ఏం పార్వతీ ఏమిటి కలవరిస్తున్నావు? కలగాని వచ్చిందా-ఏ" అంటున్నాడు. సిగ్గుతో పార్వతి ముఖం ఎఱ్ఱబడింది. యిప్పటిదాకా తన కల! ఏమిటీ వింతవూహాలు తనకి!...తన కలకి తనకే నవ్వొచ్చింది.

"టైమెంతవుతుంది కృష్ణా?" మృదువుగా అడిగింది. హమ్మయ్య అనుకున్నాడు కృష్ణమూర్తి. మళ్ళీ మామూలు పార్వతే అని అతనిధైర్యం. లేచి టైంచూశాడు. నాలుగవుతోంది, 'యింకా పడుకోవచ్చు తెల్లారుఝాము అవుతోంది.' అన్నాడు మళ్ళీ పడుకుంటూ.

పడుకుంటూన్న కృష్ణమూర్తి తల తన హృదయానికి హత్తుకుంటూ అడిగింది పార్వతి "తెల్లవారు ఝామున వచ్చిన కలలు నిజం అవుతాయి అంటారు. నిజమేనా?"

కృష్ణకి తెలుసు పార్వతి కలలు. పిచ్చికలలు. కలతపెట్టి గాభరా పెట్టేసే కలలు. అందుకే అన్నాడు. "చెడ్డకలవస్తే మంచి అవుతుంది. మంచి కలవస్తే చెడు అవుతే అవుతుంది, లేకుంటే లేదు. ఇంతకీ వచ్చిన కలేమిటీ?" రేగిన పార్వతి ముంగురులు సవరిస్తూ అడిగాడు.

"చెడ్డదే. కాని కృష్ణా ఫోర్జరీకి శిక్ష ఎంతుంటుందో?"

"మూడేళ్ళనుంచి ఏడేళ్ళదాకా పడొచ్చు. యింతకీ ఎవరికో?" తనలో తనులా అన్నాడు.

"నీకు తెలుసు." అంది పార్వతి.

"అవును నాకు తెలుసు." అంటూ పార్వతిని చేతుల్లోకి తీసుకున్నాడు హాయిగా ఊపిరివదుల్తూ. మళ్ళా కొన్నాళ్ళు పార్వతి పేచీలు పెట్టదనే—ఆ హాయి.

---

గాంధేయ సూత్రాలను అర్థంచేసుకునేటప్పుడు ముఖ్యంగా ఒకటి జ్ఞాపకం పెట్టుకోవాలి: అహింస అనే నైతిక సిద్ధాంతాన్ని కొంతలో కొంత మన్నించి దాని ఆకర్షణకి లొంగిపోగల్గే వారినే ప్రత్యర్థులుగా గాంధీజీ ఎదుర్కోవడం జరిగింది. బ్రిటిష్‌వాళ్లు తమ ప్రతిచర్యలలో ఒక సరిహద్దు మెట్టు నిర్ణయించుకుని, ఆ మెట్టు దాటి అడుగుకి వెళ్ల లేదు; వెళ్ల లేకపోయేవారు కూడా. గాంధీజీ విజయానికి గాంధీజీ వ్యక్తిత్వమేగాక, ఆయన ప్రజల ప్రవర్తనేకాక, బ్రిటిష్‌వాళ్ల ప్రవర్తన కూడా ప్రముఖంగా తోడ్పడిందని మనం ఒప్పుకోవాలి.—(డా॥ రాజేంద్రప్రసాద్)